
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 జనవరి 2023
5
తిరుపతి



అలిపిరి భూదేవి కాంప్లెక్స్ టోకెన్లు కేంద్రంలో స్వల్ప తొక్కిసలాట

ప్రజాశక్తి- తిరుమల: వైకుంఠ ఏకాదశి ఎస్ఎస్‌డి దర్శన టికెట్ల క్యూలలో స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. శనివారం రాత్రి ఈ ఘటన అలిపిరి భూదేవి కాంప్లెక్ టికెట్ల మంజూరు కేంద్రంలో జరగగా వెంటనే తేరుకున్న సిబ్బంది నివారించారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది గేట్లను వేసి ఉండగా వాటిని భక్తులు తోసుకుని ముందుకు వెళ్లారు. దీంతో ఈ ఘటన జరిగినట్టు భక్తులు తెలిపారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని టిటిడి అధికారులు వివరణ ఇచ్చారు. నేటి నుండి 5లక్షల టోకెన్లు 11 రోజులకు ఇవ్వనున్నారు. ఈ టికెట్ల కోసం భక్తులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. సోమవారం ఏకాదశి నాడు విశిష్టత ఉండడంతో గోవింద మాలలు వేసుకుని సుదూర ప్రాంతాల నుండి కాలినడకన వస్తున్నారు. భక్తులకు టిటిడి అధికారులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు.

కొంగొత్త ఆలోచనతో..2023

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ప్రజాదృష్టి

'గతం' అంతా మన మంచికే.. భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది.. అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం.. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన సంస్కరణలు 2023 భారాల సంవత్సరంగా మారనుంది.. ఓ వైపు స్మార్ట్ మీటర్ల భారాలు, యూజర్‌ఛార్జీలు, నూతన విద్యా విధానం తదితరాలన్నీ జనానికి భారం కానున్నాయి.. మరోవైపు పాలకుల హామీలైన సిపిఎస్ రద్దు, కనీస వేతనం అమలు, ఖాళీల భర్తీ తదితరాలన్నీ నీటిమూటలే అయ్యాయి. అయితే బూర్జువా పార్టీలకు జనంపై భారాలేవీ పట్టడం లేదు.. సంస్కరణల అమల్లో కేంద్రంతోటే రాష్ట్ర ప్రభుత్వం 'సై' అంటోంది.

బ్రిటీష్‌కాలంలో తీసుకొచ్చిన 44 కార్మిక చట్టాలను కుదించి కార్మిక హక్కులు కాలరాసేలా కేంద్రం నిర్ణయిస్తే అందుకు వేదిక తిరుపతి అయ్యింది. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గిన జగన్మోహన్‌రెడ్డి విద్యుత్ సంస్కరణలు, కార్మిక చట్టాలు, నూతన విద్యా విధానం తదితరాలన్నీ ముందుకు తీసుకెళుతున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం ఈ సంస్కరణల అమలుకు వెనకడుగు వేస్తుంటే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'సై' అనడం వ్యతిరేకతను మూటగట్టుకోనుంది. సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ నిర్ణయంపైనా స్పష్టత లేదు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తామని చెప్పినా ఆచరణలో లేదు. టిటిడిలో 16వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నా కనీస వేతనానికి నోచుకోకపోవడం గమనార్హం. గత 770 రోజులపైనే టిటిడి ఫారెస్టు కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు సరే అద్దెబస్సులు పెరిగిపోయాయి. అంతేకాదు కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు పెండింగ్ ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా విభజన పదవుల పందేరానికి ఉపయోగపడింది తప్ప ప్రజల అభివృద్ధికి నోచుకోలేదు. ఇందులో భాగంగానే నగరి ఎంఎల్ఎ ఆర్‌కె రోజా మంత్రి కొత్తగా పదవి దక్కించుకున్నారు. పాలన అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఓ వైపు జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నా, రాష్ట్ర రహదారులు గుంతలమయమై ప్రయాణికులను వెక్కిరిస్తున్నాయి. సంక్షేమ పథకాలకే పరిమితమైన జగన్మోహన్ రెడ్డి జీతాలను సకాలంలో ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. 'స్థానిక' సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోవడంతో వారిలో అంతర్గతంగా వ్యతిరేకత పెంచుకుంటున్నారు. సచివాలయాల వల్ల తమకు ప్రాముఖ్యత లేదని వారు వాపోతున్నారు. అధికార పార్టీలో ముఠా కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. ఇప్పటికీ మంత్రి పెద్దిరెడ్డి, ఆర్‌కె రోజా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలానే పరిస్థితి ఉంది. 'చెవిరెడ్డి' అందరివాడిలా కనిపిస్తున్నా నియోజకవర్గంలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రాంనారాయణరెడ్డి అయితే బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. అధికార పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలపైన ధ్వజమెత్తాల్సిన టిడిపి ప్రేక్షకపాత్ర పోషిస్తూ అపుడపుడు 'ఇదేం ఖర్మ' అంటోంది. ఇక జనసేనయితే ఓటింగ్ లేనివారే అభిమానులు ఎక్కువ.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణల ప్రభావం, మతోన్మాదులను ఏకోన్ముఖంగా పోరాటాల రూపంలో అడ్డుకుంటోంది కేవలం వామపక్షాలే. హిందుత్వవాదాన్ని తెరపైకి తెచ్చిన ప్రతిసారీ తిప్పికొడుతోంది. కులవివక్ష, కులదురహంకార హత్యలపై క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తోంది. కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులకు అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాడుతోంది. ప్రజా సమస్యలపై ప్రజలతో మమేకమై 'ఎర్రజెండా' రాజీలేని పోరాటాలు చేస్తోంది. రానున్న కాలం పోరాటాల కాలంగా ప్రకటించింది.

సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాలు పరిశీలన



వైకుంఠ ఏకాదశి కౌంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ , జెఈఓ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 2 నుండి 11వ తేదీ వరకు జరిగే వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాలను శనివారం కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, టీటీడీ జేఈవో సదాభార్గవి పరిశీలించారు. సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాల వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, బారికేడ్లను వారు పరిశీలించారు. ఈ కేంద్రాలవద్ద పోగయ్యే చెత్త ఎప్పటికప్పుడు తొలగించడానికి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పారిశుధ్య కార్మికులను నియమిస్తామని చెప్పారు. టీటీడీ ఆరోగ్యవిభాగం అధికారులు, టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ప్రత్యేక విధులకు నియమించిన టీటీడీ అధికారులు మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పని చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ , తాగునీటి సరఫరా పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రతి కౌంటర్ వద్ద భక్తులకు టిఫిన్, అన్నప్రసాదాలు, టీ,కాఫీ, తాగునీరు నిరంతరంగా సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని జేఈవో సదా భార్గవి కలెక్టరుకు తెలియజేశారు. జనవరి 1 నుండి టోకెన్ల జారీ ప్రారంభించి కోటా పూర్తి అయ్యేవరకు నిరంతరంగా జారీ చేయడానికి ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని, వాటి నిర్వహణకు అవసరమైనంత మంది సిబ్బందిని నియమించామని ఆమె వివరించారు. రామచంద్ర పుష్కరిణి, ఇందిరామైదానం, శ్రీనివాసం, విష్ణునివాసం, గోవిందరాజస్వామి సత్రాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసుల సహకారంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టీటీడీ అధికారులకు సూచించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేశారని ఆయన చెప్పారు. ఎల్ఈడి స్క్రీన్లు సక్రమంగా పని చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ ఈ వెంకటేశ్వర్లు ,విజివో మనోహర్, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్ , సుబ్రహ్మణ్యం, డీఈవో భాస్కర్ రెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, ఐటి జీఎం సందీప్, ఈఈ లు మనోహర్, మురళి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

టోకెన్ల జారీ కేంద్రాల్లో క్యూఆర్ కోడ్ సదుపాయం

తిరుపతిలో ఏర్పాటు చేసిన తొమ్మిది సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాల్లో భక్తుల సౌకర్యం కోసం క్యూఆర్ కోడ్ సదుపాయం ఏర్పాటు చేశారు. భక్తులు తమ మొబైల్ లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఎలా వెళ్ళాలో సూచిస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఏర్పాటు చేసిన ఈ విధానం విజయవంతమైన నేపథ్యంలో తిరుపతిలోనూ ఏర్పాటు చేశారు.

ల్యాంకో అరాచకాలకు అడ్డుకట్ట వేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్(ల్యాంకో) అరాచకాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రాచగున్నేరి ల్యాంకో పరిశ్రమ వద్ద చిందేపల్లి గ్రామస్తులతో కలిసి సిఐటియూ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ల్యాంకో యాజమాన్యం దౌర్జన్యాలు నానాటికీ మితిమీరిపోతున్నాయని చెప్పారు. మొన్న కార్మిక యూనియన్ జెండాలను రాత్రికి రాత్రే తొలగించింది గాక నేడు చిందేపల్లి లింకు రోడ్డును ఆక్రమించి గేటు ఏర్పాటు చేయడం వారి దౌర్జన్యకాండకు పరాకాష్టగా నిలుస్తోందన్నారు. శ్రీకాళహస్తి-తిరుపతి ప్రధాన రోడ్డు మార్గం నుండి చిందేపల్లికి లింకు రోడ్డు అనాధిగా వాడుకలో ఉందనీ, అయితే ల్యాంకో యాజమాన్యం బలవంతంగా రోడ్డును మూసివేసి రాకపోకలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. చిందేపల్లి లింకు రోడ్డును మూసి వేయడమే కాకుండా ఆక్రమణలకు పూనుకుంటున్నారనీ, గ్రామస్తులను, రైతులను ముళ్ల పొదల మధ్య నడవాలంటూ హుకుం జారీ చేస్తున్నారంటూ మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చిందేపల్లి రోడ్డులో యధావిధిగా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రోడ్డును బలవంతంగా మూసివేయడమే కాకుండా ఆక్రమణలకు దిగుతున్న ల్యాంకో పరిశ్రమపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ పెంచలయ్య, సుబ్రమణ్యం రెడ్డి, వెంకటయ్య, రంగయ్య, బాలకృష్ణ, గంధం మణి, పెనగడం గురవయ్య, చిందేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.


ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నూతన ఆంగ్ల సంవత్సర దినం సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు కె.నారాయణ స్వామి, రాష్ట్ర విద్యుత్తు, అటవీ భూగర్భ గనుల శాఖామాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖా మాత్యులు ఆర్.కె.రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీ లు రెడ్డప్ప, డా.మద్దిల గురుమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, శాసన మండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులురెడ్డి, విఠపు బాలసుబ్రమణ్యం, ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, ఎస్.పి పరమేశ్వర్ రెడ్డి, జే.సి. డి.కే. బాలాజీ, డి ఆర్ ఓ శ్రీనివాస రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ భోగ భాగ్యాలతో సంపూర్ణ ఆరోగ్యంతో మంచి వర్షాలు పడి రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కోవిడ్ నియమ నిబంధనలు పాటిస్తూ వేడుకలు శాంతి యుతంగా జరుపుకోవాలని సూచించారు.

టిడిపి నేత చల్లా బాబుపై దాడికి ఖండన : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తెలుగుదేశం పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్ చార్జి చల్లా బాబుపై వైసీపీ గుండాలు పుంగనూరు నియోజకవర్గం సోమల మండలంలో దాడికి పాల్పడటాన్ని సిపిఎం నేత కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పుంగనూరు నియోజకవర్గంలో అరాచకం రాజ్యమేలుతోందని, ప్రతిపక్ష పార్టీలపై కేంద్రీకరించి దాడులకు పాల్పడుతున్నారని, పోలీసు, న్యాయవ్యవస్థ, రాజ్యం అచేతనంగా తయారయ్యాయని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షం ప్రచార కార్యక్రమాలకు అడుగడుగున ఆటంకం కల్పించడంపై కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. అరాచకం ఎంతో కాలం సాగదని, రౌడీయిజాన్ని, నేర ప్రవత్తిని నమ్ముకున్న నేతలు ఎంతోకాలం మనుగడ సాగించలేరని ఆయన అన్నారు. శుక్రవారం రోడ్లకు అడ్డం నిలబడి కర్రలు, రాళ్లతో దాడులకు వైసిపి గూండాలు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం అన్యాయమని అన్నారు. రానున్న రోజుల్లో అరాచకాలను సమిష్టిగా ఎదుర్కోవాలని రాజకీయ పక్షాలకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలలో కోతలు ఆపాలి

సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వం నుండి నిరాశే ఎదురవుతున్నది. సంక్షేమ పథకాలు, నవరత్నాల క్రింద పంపిణీ చేస్తున్న సహాయంలో కోతవల్ల ప్రజలకు అందాలని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వీ.నాగరాజు శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అమ్మఒడి డబ్బులతో ట్యాబ్‌లు కొని కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారన్నారు. రానున్న కాలంలో సంక్షేమానికి పెద్ద దెబ్బ తగులుతుందని సిపిఐ(యం) హెచ్చరిస్తుందన్నారు. రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతోపాటు పండుగ సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం గడువు తీరనుందని, కనుక దాని గడువును పెంచాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తుందన్నారు. నోడల్ ఏజెన్సీల ద్వారా సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమ గేటు వసూలు ఆపాలి

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ధర్నా



అక్రమ వసూలు ఆపాలని ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తోపుడుబండ్ల వ్యాపారస్తుల నుండి చేస్తున్న అక్రమ వసూళ్లను అరికట్టాలని శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ వీధివర్తక వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేస్తే 2014లో పార్లమెంట్ వీరి సమస్యల పరిష్కారం కోసం కొన్ని చట్టాలు చేయడం జరిగిందన్నారు. ఆ చట్టం ఆధారంగా వీరి సమస్యలు పరిష్కరించాలని తెలియజేశారు. తిరుపతి నగరంలో కొంతమంది దళారులు నిబంధనలకు వ్యతిరేకంగా గెజిట్ మినహాయింపు ఉన్న, దౌర్జన్యంగా బెదిరించి డబ్బులు తీసుకోవడం అన్యాయమని దీన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. వెంటనే తిరుపతి మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని అక్రమ గేటు వసూలు అరికట్టాలని, టెంకాయ చిప్పలు, టెంకాయ బండ్ల వద్ద నుంచి మున్సిపల్ సిబ్బంది తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి ధర్నా వద్దకు విచ్చేసి అందరి సమక్షంలో హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలపై రిప్రెజెంటేషన్ తీసుకొని వారి సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాకర్స్ యూనియన్ నాయకురాలు పి .బుజ్జి, సిఐటియు జిల్లా నేతలు టి.సుబ్రహ్మణ్యం, ఆర్ లక్ష్మి, సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే.వేణుగోపాల్, నగర అధ్యక్షులు పీ.మునిరాజా, నగర ఆఫీస్ బేరర్స్ పి.చిన్న, నగర నాయకులు పార్థసారధి రెడ్డి, మనోహర్, ఆకర్స్ యూనియన్ నాయకులు అధ్యక్షులు శ్రీను మణిమాల సుబ్రహ్మణ్యం శాంతి పవిత్ర ఈశ్వర్ రెడ్డి రమణ శోభ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దళితుల అభివృద్ధికి కేటాయించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప డిమాండ్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్లిస్తుందని, ఈ నిధులను దళితుల అభివృద్ధికి కేటాయించాలని శనివారం యశోద నగర్‌లో ఎంబీ భవన్‌లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు పి.మునిరామయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోతుందని, ఉన్న చట్టాలు కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై దళితుల అందరినీ ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి కాలయ్య మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడు దళితులపై రాజకీయ పార్టీలకు ప్రేమ పుట్టుకొస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల సమస్యలపై పట్టించుకోక పోవడమే కాకుండా, దళిత కాలనీల అభివృద్ధికి, వారి సంక్షేమానికి కేటాయించబడిన ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను కూడా పక్కదారి మళ్లించడం చాలా దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన, బలహీన వర్గాల వారి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి నిరుద్యోగ యువకులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. అవకాశవాద రాజకీయ పార్టీల పట్ల ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి బాలసుబ్రమణ్యం, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎండి శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయి లక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్థసారథి, మనోహర్, ప్రజా సంఘాల నాయకులు గీత, నాయుడు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కమిషనర్ అనుపమఅంజలి




జి పాలెంలో గృహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జగనన్న ఇళ్ళ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచిస్తూ జీపాళెం జగనన్న లేఅవుట్‌ను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి శనివారం పరిశీలించారు. అనుకున్న మేరకు పనులను చేపట్టి సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా జరగబోవు గృహప్రవేశాలకు ఇళ్ళను సిద్ధం చేయాలని కమిషనర్ అనుపమ అన్నారు. తిరుపతి అర్బన్ నివాసితులకు కేటాయించిన ఇంటి స్థలాల్లో నిర్మాణాలు వివిధ దశల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, జీ పాళెంలో ఇళ్ళ నిర్మాణాలకు ముందుకొచ్చిన లబ్ధిదారుల సహకారంతో ఇరవై ఇళ్ళను గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నట్లు డిఈ మహేష్ కమిషనర్‌కు వివరించారు. అదేవిధంగా సుమారు వంద ఇళ్ళ స్థలాలు కేటాయించినా కూడా ఆ స్థలాల్లో లీగల్‌గా ఇబ్బందులు రావడంతో వారికి ఆ లే అవుట్లలోనే సర్వేలు నిర్వహించి కొత్తగా ప్లాట్లు కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు. కొన్ని నిర్మాణాలు గోడలు పూర్తి చేసుకోవడం, మిగిలినవి స్లాబ్ లెవల్లో పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఐరన్ కొరత లేకుండా హౌసింగ్ అధికారులతో కలిసి పని చేయాలని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. కమిషనర్ వెంట డీఈ మహేష్, హౌసింగ్ సిబ్బంది, అమ్మెటి సెక్రట్రీలు పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సచివాలయ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి హెచ్చరించారు. తిరుపతి మున్సిపల్ పరిధిలోని 17వ డివిజన్ బైరాగపట్టెడ 5, 6 సచివాలయాల్లో శనివారం కమిషనర్ అనుపమ అంజలి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అను సంధానంగా ఉంటూ ప్రభుత్వ సేవలను సకాలంలో అందించేలా ఏర్పాటుచేసిన సచివాలయాల్లో నిర్లక్ష్యం సహించరానిదన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందిం చేలా సచివాలయ సిబ్బంది పని చేయాలన్నారు. పథకాల లబ్ధిపొందు తున్న వారి వివరాలను సక్ర మంగా పొందు పర్చాలన్నారు. ప్రభుత్వ పథకాల వివరాలను ప్రజలందరికి తెలిసేలా నోటీసు బోర్డులు ప్రదర్శించేలా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అనుపమ అంజలి ఆదేశాలు జారీచేసారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ఈఓ సమీక్ష



ప్రజాశక్తి -తిరుమల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో వివిధ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లపై టిటిడి ఈఓ(ఎఫ్ఏసి) అనిల్ కుమార్ సింఘాల్ శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల్లో సిబ్బంది అప్రమత్తంగా పనిచేసేలా అధికారులు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయంతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో అదనంగా వైద్యులను, పారామెడికల్ సిబ్బందిని, అంబులెన్సులను అందుబాటులో ఉంచు కోవాలన్నారు. పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్మెంట్లు, కృష్ణతేజ విశ్రాంతి గృహం నుంచి శిలాతోరణం వరకు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, అదనపు మరుగుదొడ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులు తిరుపతిలో టోకెన్లు పొంది తిరుమల శ్రీవారి దర్శనానికి రావాలని అవగాహన కల్పించేందుకు తిరుపతిలోని బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న కరపత్రాలు పంపిణీ, ప్రసారాలను నిరంతరం కొనసాగించాలన్నారు. సమీక్షలో టిటిడి అదనపు ఈవో(ఎఫ్ఏసి) వీరబ్రహ్మం, జెఈఓ సదా భార్గవి, సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన తిరుపతి విద్యార్థులు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

3వ ఓపెన్ ఇంటర్నేషనల్‌లో తిరుపతి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 29వ, 30వ తేదీలలో బెంగళూరులోని ఎలంకలో రియాన్ ఇంటర్నేషనల్ స్కూల్లో వేదికగా తిరుపతికి చెందిన 8 మంది క్రీడాకారులు పలు విభాగంలో పాల్గొన్నారు. అండర్ 10 విభాగంలో జి.సంజన, ఎం.బిందు ఎం.యశ్వంత్, బంగారు పతకాలు సి.అశోక్ రెడ్డి, ఏ. లాల్ కృష్ణ వెండి పథకాలు సాధించారు. అండర్ -15 విభాగంలో ఎస్.మహమ్మద్ సాహి ఉద్దీన్, అండర్ 20వ భాగంలో వి.నిఖిల్ రెడ్డి, అండర్ 25 విభాగంలో డి.ప్రదీప్ వెండి పతకాలు సాధించారు. వీరందరినీ తైక్వాండో శిక్షకుడు డాక్టర్ మాస్టర్ గోపినాథ్ అభినందించారు.

భగత్ సింగ్ టోర్నమెంట్ గోడ పత్రిక ఆవిష్కరణ



భగత్ సింగ్ ఉచిత ట్యూషన్ పోస్టను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా తిరుపతిలో భగత్ సింగ్ క్రికెట్, కబడ్డీ, షటిల్ టోర్నమెంట్లు జనవరి 6, 7 8 తేదీల్లో ఇస్కాన్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా శనివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ ఉచిత ట్యూషన్ సెంటర్లో టోర్నమెంట్‌కి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర జిల్లా అధ్యక్షుడు ఎం.నరేంద్ర మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు అందరూ ఆనందంగా గడపాలన్నారు. ఈ సందర్భంగా యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి ఆటల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి అందరూ విరివిరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. క్రికెట్ టోర్నమెంటుకు 999 ఎంట్రీ ఫీజు నిర్ణయించడం జరిగిందని, ప్రైజ్ మనీగా విన్నర్‌కు రూ.7777, రన్నర్‌కు రూ.4444 ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా కబడ్డీకి షటిల్ కూడా ప్రోత్సాహకరమైన బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనదల్చుకున్న వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు 9441630 723, 799 77 07177 సంప్రదించాలన్నారు. గోడపత్రికను ఆవిష్కరించిన వారిలో డివైఎఫ్ఐ నాయకులు విజయ్, అనిల్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మేయర్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి, రుయా హాస్పిటల్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 2023 సంవత్సరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష యూనియన్ సభ్యులకు వైద్య ఉద్యోగులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వెంటనే పరిష్కరించడానికి మేయర్‌గా తమ వంతు మీకు సహకారం అందించగలమని తెలిపారు. మంచి జరగాలని మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, రుయా హాస్పిటల్ బ్రాంచ్ కార్యదర్శి ప్రభాకర్ అధ్యక్షులు సురేంద్ర, ట్రెజరర్ సురేంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ వినోద్, మురళీధర్, మొహిద్దీన్, లోకేష్ బాబు, వర్మ, మునిరత్నం, ఎస్వి వైద్య కళాశాల అధ్యక్షులు వీర కిరణ్ తదితరులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి భారీ బందోబస్తు

తిరుపతి జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకొని శనివారం ఎస్పీ కార్యాలయంలో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహ కిషోర్, జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ఏకాదశి ద్వాదశి పర్వదినాలో వైకుంట దర్శనార్థం స్తానిక ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అశేష భక్త జనం వస్తున్నందున వారికి భద్రతపరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఉన్నాం అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన తిరుమల తిరుపతి దేవస్థానం వారు వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు. ప్రజలు ఆత్రుత పడకుండా సహనం వహించి తోపులాటకు అవకాశం ఇవ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో వైకుంట ద్వార దర్శనం చేసుకొని టిటిడి వారి నియమ నిబంధనలు, సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు.

మహిళలకు సాధికారికత కల్పిస్తున్న ఎలక్ట్రోస్టీల్

నెలకు రూ. 15000 -రూ.18000 వరకు సంపాదించే అవకాశం



ప్రజాశక్తి -తిరుపతి సిటి : భారతదేశంలో అగ్రగామిగా ఉన్న ఎలక్ట్రోస్టీల్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ (ఈషీఎల్) తన కార్పొరెట్ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద నైపుణ్యాభివృద్ధి కేంద్రం నెలకొల్పి మహిళలలో సాధికారత నెలకొల్పుతుందని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సురేష్ ఖండేల్వాల్ తెలిపారు. తిరుపతి, శ్రీకాళహస్తి పరిసర గ్రామాల్లో నివసించే మహిళలకు సాధికారికత కల్పించేందుకు, ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు తోడ్పడే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించబడిందన్నారు. మహిళల కోసం టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో 100 రోజుల పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరమ్ సంస్థకు చెందిన వృత్తినిపుణులైన శిక్షకులు మహి ళలకు శిక్షణ అందిస్తున్నారు. దుస్తులు కుట్టడం ద్వారా నెలకు రూ.15,000 నుంచి రూ.18,000 దాకా పొందగలుగుతున్నారన్నారు. ఆరోగ్యం, విద్య, సాధికారత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడల రంగాలలో క్రియాశీల కార్పొరెట్ సామాజిక బాధ్యత ద్వారా గ్రామ జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కంపెనీ అనేక కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో మహిళలు ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'శుభమస్తు'లో సంక్రాంతి ఆఫర్లు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా శుభమస్తు షాపింగ్ మాల్‌లో ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు రెండు కార్లు, 44 ఎలక్ట్రికల్ స్కూటర్లు గిఫ్ట ఆఫర్లుగా ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 29వ తేదీ తిరుపతి షో రూమ్‌లో నిర్వహించిన లక్కీ డ్రా లో గెలుపొందిన విజేతలకు తుడ మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ బహుమతులు అందజేశారు. 26వ డ్రా విజేతగా తిరుపతికి చెందిన నరసింహ, 27వ డ్రా విజేతగా చైతన్యకుమార్లకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి వరకు ప్రతి రూ.1000 కొనుగోలుపై ఒక కూపన్ పొందగలరని, దీని ద్వారా లక్కీ డ్రాలలో పాల్గొని విజేతులు కాగలరని సూచించారు. ఆ షో రూమ్ మేనేజర్ శంకర్ మాట్లాడుతూ పండగల సందర్భంగా తమ షాపింగ్ మాల్‌కు విచ్చేసిన వినియోగదారులకు వన్ ప్లస్ వన్, వన్ ప్లస్ టు ఆఫర్లు అందిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగాలు సభ్యులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆచార్య శ్రీకాంత్ రెడ్డి సేవలు అమోఘం

పార్లమెంట్ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యారంగంలో ఆచార్య శ్రీకాంత్ రెడ్డి సేవలు అమోఘ మని, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాల యం రెక్టార్, సైకాలజీ విభాగ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి సేవలు మన విద్యారంగానికి ఎంతో అవసరమని పార్లమెంటు ప్యానెల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందిన రెక్టార్ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పదవీ విరమణ సన్మాన సభ శనివారం సెనేట్ హాల్లో నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ తదితరులు ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డిని శాలువా, పుష్పగుచ్చం, జ్ఞాపిక, గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సెజెఆర్ చంద్రయ్య, డాక్టర్ సుందర్ రెడ్డి, డాక్టర్ సిద్ధారెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, దామోదర్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, పోతు మురళీధర్, కిషోర్, ఏసీ వీరారెడ్డి, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఘన సన్మానం

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మనోవిజ్ఞాన శాస్త్రం విభాగం అధ్యక్షులు ఆచార్య విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థినీ, విద్యార్థులు గజమాల, దుశ్శాలువ, కిరీటాలతో ఆచార్య శ్రీకాంత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి- కేవిబిపురం: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, పుత్తూరు రూరల్ సిఐ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌డిపిఒ రామరాజు పర్యవేక్షణలో కెవిబి పురం మండలంలో నూతన సంవత్సరం సందర్భంగా శనివారం సాయంత్రం నుండి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరం సందర్భంగా 2023 జనవరి 1వ తేదీ పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, సుప్రసిద్ధ ఆలయాల వద్ద భక్తుల రద్దీ, పర్యా టకుల రద్దీ క్రమబద్ధీకరించేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరక్కుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎవరైనా మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడిపినా, నిబంధనలు అతిక్రమించినా, పర్యాటకులకు, భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ప్రజలు యువకులు పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

బిఎన్‌కండ్రిగ: మండలంలోని శనివారం రాత్రి జరుపుకునే నూతన సంవత్సర వేడుకలలో బిఎన్‌కండ్రిక సబ్ ఇన్స్పెక్టర్ మంజునాథరెడ్డి మండల ప్రజలకు, యువతకు కొన్ని సూచనలు సలహాలు హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకలు ఎవరి జీవితాల్లో, కుటుంబాల్లో విషాదం మిగల్చరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పుత్తూరు టౌన్ : బహిరంగ ప్రదేశాలలో నూతన సంవత్సర వేడుకలు నిషేధమని పుత్తూరు సిఐ లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, డిసెంబర్ 31వ తేదీ రాత్రి, ఒకటవ తేదీ నాటికి రోడ్లపై కేకులు కట్ చేయడం రికార్డ్ డాన్సులు వంటి నిర్వహించరాదని అలా నిర్వహిస్తే వారిపై కఠించడం తీసుకోవడం జరుగుతుందన్నారు. యువకులు ప్రజలు, మద్యం తాగి రోడ్లపైకి రావడం అతివేగంగా వాహనాలు నడపడం చేరాదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

సమస్యల వలయంలో వేడం పంచాయతీ

- బురదమయంగా రోడ్లు
- ఎక్కడ చూసినా చెత్తకుప్పలు
- కాలుష్యమవుతున్న తాగునీరు
- ఆందోళనలో గ్రామస్తులు



మురికి కాలువను తలపిస్తున్న వేడం ప్రధాన రహదారి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నివసించే ప్రజలకు ఎప్పుడు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండటానికి ప్రతి 2000 జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని నిర్మించి అందులో ప్రతి విభాగానికి సంబంధించి అధికారులను నియమించింది. అలాగే ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించింది. గ్రామాల్లో నివసించే ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటాయని నాయకులు అంటుంటారు. గ్రామాల్లో నివసించే ప్రజలకు ముఖ్యంగా కావలసిన పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులకు ఎక్కడా ఎటువంటి లోటు రాకుండా చూసుకోవలసిన బాధ్యత గ్రామ సచివాలయ డిడిఓ మీద ఆధారపడి ఉంటుంది.

మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 'వేడం' మేజర్ పంచాయతీలలో ఒకటి. గ్రామ సచివాలయ పరిధిలో రామాపురం పంచాయతీ కూడా ఉంది. వేడం పంచాయతీలో మొత్తం 975 కుటుంబాలు సుమారు 3000 మంది జనాభా కలిగి ఉన్న పంచాయితీ. అలాగే రామాపురం పంచాయతీలో 150 కుటుంబాలు సుమారు 600 మంది జనాభా కలిగి ఉన్న పంచాయతీ. ఇటువంటి మేజర్ పంచాయతీలో సమస్యలు కూడా బాగా మేజర్ గానే ఉన్నాయంటూ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎప్పటినుంచో నాయకులు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ అంటూ నెత్తినోరు కొట్టుకుంటున్నప్పటికీ ఇక్కడ అధికారులకు మాత్రం చీమకుట్టినట్టు కూడా కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 'వేడం' ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను చూస్తుంటే ఈ పంచాయతీలో పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. కరోనా మళ్ళీ వస్తుంది బాబోయ్ అనే మాటలు ఆ నోట ఈ నోట వినిపిస్తున్నప్పటికీ చెత్తను శుభ్రం చేయించకుండా వదిలేసిన తీరు చూస్తుంటే ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనబడుతుంది. గ్రామ ప్రజలు ప్రాణాలు పోతే మాకేంటి ఉంటే మాకేంటి మాకు నెల పెడితే జీతం వస్తే చాలు. ఎవరికి ఏమైపోతే మాకేం ఎవరి ప్రాణాలు పోతే మాకేం అనే చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు గ్రామ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

వేడం పంచాయతీలో తాగునీటి కోసం ఒక మంచి నీటి ట్యాంకు ఉంది. అయితే ఈ ట్యాంకు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వచేరి ఉండటంతో ఎక్కడ ఈ నీరు కలుషితంగా మారి ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందోనని గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్న వేడం గ్రామ సచివాలయానికి శాశ్వత డిడిఓ లేకపోవడంతో అమ్మపాలెం గ్రామ సచివాలయంలో డిడిఓగా విధులు నిర్వహిస్తున్న అధికారిని ఇన్‌చార్జ్ డిడిఓగా నియమించడం అలాగే ఈ అధికారినే ఏంపేడు గ్రామ సచివాలయ ఇన్‌ఛార్జి డిడిఓగా కొనసాగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపేడు గ్రామ సచివాలయ పరిధిలో ఇనగలూరు పోలీ గ్రామ సచివాలయ డిడిఓలు అందుబాటులో ఉన్నప్పటికీ 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మపాలెం గ్రామ సచివాలయ డిడిఓని ఎంపేడు గ్రామ సచివాలయ ఇన్చార్జ్ డిడిఓగా ఎందుకు నియమించారో అర్థం కావట్లేదని ఆరోపణలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఒకే వ్యక్తిని మూడు గ్రామ సచివాలయ డిడిఓగా కొనసాగించడం పట్ల ఆంతర్యం ఏమిటని గ్రామ ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక గ్రామ సచివాలయానికి ఒక శాశ్వత డిడిఓ ఉంటే ఆ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటారని అదే ఒకే అధికారికి మూడు గ్రామ సచివాలయాల బాధ్యత ఇస్తే ఇలాగే సమస్యలు విలయతాండవం చేస్తాయని మాటలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి వేడం గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న గ్రామ ప్రజల సమస్యలను తీర్చాలని వేడం గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం మీద ఈవోపీఆర్డీ సురేంద్రనాథ్‌ను వివరణ కోరగా వేడం పంచాయతీలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే ఇన్‌చార్జ్ డిడిఓల సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు.



రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారం

విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఇంటికే..

హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం చేయాలి: ఆర్డీఓ రామారావు



ప్రజాశక్తి- తొట్టంబేడు: హౌసింగ్ నిర్మాణాల్లో విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఆ అధికారులు ఇంటికి వెళ్లాల్సిందేనని ఆర్డీఓ రామారావు అన్నారు. శనివారం అయినా మండలంలోని బీడీకాలనీలో జగనన్న గృహాలను పరిశీలించారు. అనంతరం అయినా ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి వారికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయకపోతే ఊరుకునేది లేదన్నారు. పని చేయని అధికారులపై మండిపడ్డారు. ఎప్పుడో స్లాబ్ లెవల్ వరకు పూర్తయిన గృహాలు ఇంకా ఎందుకు పూర్తి చేయలేదని వారిపై చిందులేసారు. జనవరి నెల 20వ తారీకుకు అంతా జగనన్న ఇళ్లు పూర్తికావాలని అధికారులకు సూచించారు. ఎక్కువగా దళిత గిరిజనుల గృహాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనుసంధానా పోయాయి వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. తొట్టంబేడు ఏపిఎం విధులు సక్రమంగా నిర్వహించలేదని దళితులకి గిరిజనులకి వెలుగు కార్యాలయం తరపున సహాయం చేసి వాళ్ళ గృహాలు పూర్తి చేయాలన్నారు. డిఆర్‌డిఎ ఉండేది నిరుపేదల కోసమే అని హెచ్చరించారు. నిరుపేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఆ అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ ,డిప్యూటీ తాసిల్దార్ సుధీర్ రెడ్డి, ఎంపీడీవో తరునాక్షి రెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ సెక్రటరీలు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు-హనుమంతాపురం బస్సు ప్రారంభం



ప్రజాశక్తి- పిచ్చాటూరు : మండలంలోని పిచ్చాటూరు-హనుమంతాపురం మండలం బస్సు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్యవేడు డిపో డిఎం పివి రమణ చేతులు మీదగా శనివారం మండల కేంద్రమైన పిచ్చాటూరు బస్టాండ్ వద్ద పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. నూతన బస్సు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి బస్సుల్లో ప్రయాణం చేసారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలం బస్సు పునరుద్ధరణ చేయడంతో మండల ప్రజకు ప్రయాణం ఇబ్బందులు తొలగనున్నారు. గడపగడపలో ప్రజలు విన్నపాలను స్వత్వరం నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. రెండో రోజులు మండలం బస్సు పునరుద్ధరణ చేయడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలం బస్సు రద్దు కావడంతో ఆటోల్లో పరిమితి మించి ప్రయాణిస్తున్న ప్రాణాలు అరచేతులలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామన్నారు. బస్సు పునరుద్ధరణ కావడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్డీసి డిఎం పివి రమణ మాట్లాడుతూ పిచ్చాటూరు హనుమంతపురం బస్సు పునరుద్ధరణ చేసినట్లు చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉదయం మధ్యాహ్నం సాయంత్రం మూడు ట్రిపులు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేఖా మండల కన్వీనర్ కెటి హరిచంద్ర రెడ్డి రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు సర్పంచ్ కె.జి రోస్ రెడ్డి ఎంపిటిసి రమేష్ రాజు బాబు రెడ్డి చెంగలరాయల్ రెడ్డి సుబ్రమణ్యం రెడ్డి మెహన్ గోవిందన్ రిప్పుసూదన్ వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: 2023 నూతన సంవత్సరం వేడుకలను భాకరాపేట గీతాంజలి స్కూల్‌లో కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్లొని కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైనవారందరికి మిఠాయిలు పంచి వారికి గిరికుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.


జె.బి.ఆర్ పాఠశాలలో ..

పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరు జెబీఆర్ పాఠశాలలో ఆ సంస్థల అధినేత జె.బి.ఆర్ డా .మునిరత్నం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.... అందరికీ కేక్‌లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఏవో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస తేజ ప్రైవేటు పాఠశాలలో..

బిఎన్‌కండ్రిగ: బిఎన్‌కండ్రిగ శ్రీనివాస తేజ హైస్కూల్‌లో శనివారం 2023 నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిఎన్‌కండ్రిగ ప్రైవేటు పాఠశాల అయిన శ్రీనివాస తేజ కరస్పాండెంట్ కే.సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు కరస్పాండెంట్ సుధాకర్‌కు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. తదుపరి కరస్పాండెంట్ సుధాకర్ విద్యార్థినీ విద్యార్థులకు తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం ఉన్నతభావాలు కలిగిన వ్యక్తి : చెవిరెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత భావాలు కలిగిన వ్యక్తిగనుకే విద్యా విధానంలో నూతన మార్పులు చేసి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మంగళం పరిధిలోని జిల్లా పరిష్యత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ సీఎం అమ్మఒడి, నాడు-నేడు, విద్యాదీవెన వంటి పథకాలతో విద్యార్థులకు, ఆర్థిక భరోసాను అందిస్తున్నారన్నారు. ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకరరాజు, ప్రధానోపా ధ్యాయులు కేశవులునాయుడు, కార్యదర్శి రాజేష్, మంగళం పరిధిలోని సీనియర్ వైసిపి నాయకులు, పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుచానూరు : జెడ్పి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ విద్యా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. దీనిలో భాగంగానే విద్యా దీవెన, అమ్మఒడి ఉన్నాయని, నూతనంగా విద్యార్థులు చదువుల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని అందుకే రాష్ట్రమంతటా విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి అధునాతన టెక్నాలజీ విద్యార్థులకు అందించారు. విద్యార్థులు విద్యను మెరుగు పరచడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఎంపీపీ యశోద ఎంపీటీసీలు నరేష్ రెడ్డి గ్యాస్ శేఖర్ శివశంకర్ వార్డ్ మెంబర్లు మునేంద్ర రాయల్ పసుపు చంద్ర డిష్ చంద్ర యాగ వాసు నాయక్ డిష్ మళ్లీ ఆర్ ఆర్ యూత్ ప్రెసిడెంట్ మోహన్ కిషోర్ వాసు అబ్దుల్ వాసు రాయల్ తిరుపతి రూరల్ మండల కన్వీనర్ హరి వైఎస్‌ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


ప్రజాశక్తి -గూడూరు : గూడూరు పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి సీఐలు, ఎస్ఐలతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి డ్యాన్సులు వంటి వేడుకలు నిషేధమన్నారు. ఈవెంట్స్ లాంటివాటికి ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. మద్యం తాగి రహదారులపై తిరిగితే చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈయన వెంట పట్టణ సీఐలు హజరత్ బాబు, రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరావు, గ్రామీణ సీఐ దశరథరామయ్య, ఒకటవ పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, రూరల్ ఎస్ఐ బ్రహ్మ నాయుడు, చిలకూరు ఎస్ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు

గడపగడపకు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ 10వ వార్డులో రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ పదో వార్డు ఇన్‌ఛార్జ్ డి.జి. ధనపాల్ ఆధ్వర్యంలో పదో వార్డు ప్రజలకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో గాలి భాను ప్రకాష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి గడపగడపకు స్వీట్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్‌ధనపాల్, యం ఈశ్వర్ యాదవ్, శ్రీనివాసులు, ఇళయరాజా, మోహన్ సూర్య, విని, సాయి, తరుణ్, గని, సుబ్బరాయుడు, యోగ,రాఖి, హమీద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో....

వైకుంఠ ఏకాదశి వేడుకలు



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వికృతమాల గ్రామంలోని శ్రీ సంతాన సంపద వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానములో జనవరి 2వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినం పురష్కరించుకుని శనివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సేవను ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల నడుమ ఘనంగా నిర్వహించారు.

దొడ్లకిషోర్‌కుమార్‌కు సేవారత్న పురస్కారం



సేవారత్న పురస్కారాన్ని అందుకుంటున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత 12 ఏళ్ళుగా సుప్రీంకోర్టు న్యాయవాదిగా వృత్తి నైపుణ్యతను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న దొడ్లకిషోర్‌కుమార్ సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఆల్ అడ్వకేట్ ఫెడరేషన్ 10వ జాతీయ సమావేశంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ చేతులు మీదుగా సేవారత్న పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. సుప్రీం కోర్టును సామాన్య ప్రజలు కూడా ఆశ్రయించేలా తోడ్పాటునందిస్తానని కిషోర్‌కుమార్ తెలిపారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ఎన్నిక

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: మండలంలోని జంబుగోళం గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గాన్ని ఎన్ను కోవడంతో బిఎన్‌కండ్రిగ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తిరుపతి జిల్లా కమ్యూనిస్టు పార్టీకి అభినందనలు తెలి యజేశారు. యువజన రంగం నుంచి నిరుద్యోగ నిర్మూలన ఉపాధి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న యువ జన నాయకుడు కత్తి రవినీ సిపిఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ప్రకటించారు. ఈ సంద ర్భంగా నూతనంగా ఎన్నికైన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి మాట్లాడుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకుందుకు జిల్లా సమితికి కృతజ్ఞతలు తెలిపారు.

హత్యకేసులో ముద్దాయి అరెస్ట్



ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలోని సిసిఎల్ కంపెనీకి పక్కన ఉన్న లేబర్ షెడ్ల వద్ద వివియం కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు డ్రైవర్ల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ హత్యాయత్నానికి కారణమైన ఘటన గత అక్టోబర్ -28న జరిగింది. సత్యవేడు సిఐ శివకుమార్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుదామ మహతో, అరుణాచల ప్రదేశ్‌కి చెందిన సొలేమాన్ ముర్ములు వివియం కన్‌స్ట్రక్షన్ కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తు న్నారు. సోలేమాన్ ముర్ము వ్యక్తిగతకారణాల వల్ల కక్ష పూరితంగా సుదామ మహతోను హత్యచేసి పరార య్యాడని ప్రాథమిక విచారణలో రుజువైందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా శనివారం నిందితుడి సంచారాన్ని గమనించి అదుపులోకి తీసుకుని, హత్య యత్నానికి కారణమైన ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకోవడం జరిగిందని సిఐ తెలిపారు. స్థానిక ఎస్ఐ నాగార్జున్ రెడ్డి, ఏఎస్ఐలు షణ్ముగం, పొన్నుస్వామి హెడ్ కానిస్టేబుల్ సాయి బాబ, సిబ్బంది సుబ్బు, గణేష్, హరి, అనిల్ కుమార్, సుదీర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కాపు గున్నేరి పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఆర్.బి.కే కేంద్రంలో ఈ క్రాప్ నమోదు ఎంతవరకు జరిగిందో డిఎఒ ప్రసాద్, ఏ.డీ.ఏ పీపీ ధనుంజయ రెడ్డి పరిశీలించారు. అనంతరం పంట పొలాల దగ్గరికి వెళ్లి రైతులతో ఈ- క్రాప్ గురించి వివరించారు. పంటలు పండించే ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని లేనిపక్షంలో రైతులకు అందవలసిన సంక్షేమ పథకాలు లేక అనుకోని పరిస్థితుల్లో నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారాన్ని కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ఏ.డి.ఏ సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి రైతు భరోసా కేంద్రాన్ని శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాద్ రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు కార్యక్రమాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసు కోవాలన్నారు. నమోదు చేసుకోవడం ద్వారా బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాలు, అతివృష్టి, అనావృష్టి సమయంలోనూ, పంట అమ్మకాలు, ధాన్యం నిలువలకు చాలా ఉపయోగకరమని ఆయన తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు అశోక్, రైతులు బియ్యపు రమేష్ రెడ్డి, కే .రఘురామిరెడ్డి, కోదండ రామయ్య, అప్పి రెడ్డి మొదలైన పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల సాధికారతే లక్ష్యం



ప్రజాశక్తి-తిరుచానూరు: ప్రత్యేక ప్రతిభావంతుల సాధికారతే సాక్షమ్ లక్ష్యమని రవీంద్రనాథ్ అన్నారు. అందుకు గాను ముఖ్య అతిధిగా విచ్చేసిన అయన సాక్షమ్ ఏర్పాటు చేసి 21 రకాల అంగవైకల్యాలతో బాధపడుతున్న వారికి మానసిక స్థైర్యం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. దివ్యాంగులు, అంగవైకల్యం, కుష్టుతో బాధపడుతున్న వారిని అక్కున చేర్చుకుని సమాన గౌరవం కల్పించడం తమ బాధ్యత అన్నారు. దీంతో పాటు సాక్ష్యమ్ ముందుకు తీసుకు పోవడానికి దాతలు సహకరించాలని పిలుపునిచ్చారు. రవీంద్రనాథ్ స్టేఫ్, సక్ష్యమ్ స్టేఫ్ పాల్గొని విజయవంతం చేశారు.

యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యుటిఎఫ్ నూతన సంవత్సర 2023 క్యాలెండర్‌ను, డైరీ, జీవోలను ఎంఈఓ భారతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ తిరుపతి జిల్లా సహాధ్యక్షులు సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ మార్టిన్ సార్, జిల్లా సాంకేతిక విభాగం కన్వీనర్ ఓ.విజయ్ కుమార్, మండల సీనియర్ కామ్రేడ్ చలపతి, మండల సీనియర్ కార్యదర్శి ఎం.దినమణి, మండల గౌరవా ధ్యక్షులు కోనేటి సుబ్రహ్మణ్యం, మండల సహా అధ్యక్షులు మనీ మేలు, మండల కోశాధికారి కారని ఢిల్లీ బాబు, మండల మహిళా కార్య దర్శి పన్నెం. హేమలత, మండల కార్యదర్శి, తిరుపాలయ్య, ఎలా శ్రీని వాసరావు, మండల ప్రధాన కార్యదర్శి హేమాంబర రావులు పాల్గొన్నారు.

మన్నెంరామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



చైర్మన్‌కు కేక్ తినిపిస్తున్న డైరెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి జన్మదినాన్ని, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం కళాశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి ఛైర్మన్‌తో కేక్ కట్ చేయించి శుభా కాంక్షలు తెలిపారు. ఛైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి, చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందకుమార్ రెడ్డి , విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.